

అసైన్డ్ భూముల ఆర్డినెన్స్ కాపీలు దహనం

ప్రజాశక్తి - నిడమర్రు

అసైన్డ్ భూములు పేదలకు పంచాలని కోరుతూ సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన బువ్వనపల్లిలో అసైన్డ్ భూముల ఆర్డినెన్స్ కాపీలను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను భూస్వాములకు కట్టబెట్టడానికి గవర్నర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చిందని, దీనివల్ల పేదలకు, దళితులకు, గిరిజనులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. ఈ ఆర్డినెన్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గవర సత్యనారాయణ, లావేటి చంద్రరావు, రైతు సంఘం నాయకులు, కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన్, సిఐటియు నాయకులు నారపల్లి రమణారావు, ఎం.బాబూరావు, పిల్ల సూర్యనారాయణ, శంకు చంటి పాల్గొన్నారు.

సిఎం సారూ..

మాటమరిచారు..!



'మాటతప్పం.. మడమతిప్పం' అంటూ గొప్పలు చెప్పే ముఖ్యమంత్రి జగన్ పోలవరం నిర్వాసితుల విషయంలో మాత్రం ఆయన ఇచ్చిన ఏ ఒక్క మాట నెరవేర్చకపోవడంతో నిర్వాసితుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతోపాటు, ఆర్అండ్ఆర్ పరిహారం అందించడం వంటి ఏ ఒక్క హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతిఏటా గోదావరి వరదలకు గ్రామాలన్నీ మునిగిపోవడం కట్టుబట్టలతో పిల్లాపాపలతో నిర్వాసితులు పునరావాస శిబిరాలకు చేరడం పరిపాటిగా మారిపోయింది. వరదలొచ్చినప్పుడు పరామర్శించి వాగ్దానాలు గుప్పించడం తర్వాత పట్టించుకోకపోవడంపై నిర్వాసితుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుంది. తాము ప్రతిఏటా పునరావాస కేంద్రాల్లోనే మగ్గిపోవాలా..? అంటూ సోమవారం వరద బాధితుల పరామర్శకు కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వస్తున్న సిఎంను నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు.



వరదలకు గ్రామాలు మునిగిపోవడంతో కొండపైన గుడారాలు ఏర్పాటు చేసుకున్న కుక్కునూరు మండల నిర్వాసితులు

41.15 కాంటూరు ముంపు గ్రామాలకు ఇస్తామన్న పరిహారమేదీ?

గతేడాది వరదలకు దెబ్బతిన్న 1280 ఇళ్లకు అందని పరిహారం

పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షల హామీ ఇచ్చి నాలుగేళ్లు

2006లో సేకరించిన భూముల పరిహారం మాటేంటి

ప్రతిఏటా పునరావాస కేంద్రాల్లో, కొండలు, గుట్టలపైనే మగ్గిపోతున్న నిర్వాసితులు

నేడు కుక్కునూరు మండలం గొమ్ముగూడెంలో సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా.. కాఫర్‌డ్యాం పూర్తిచేయడంతో ప్రతిఏటా గోదావరి వరదకు నీరు ఎగదన్ని రెండు మండలాల్లోని ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మొత్తం 107 నిర్వాసిత ప్రాంతాలున్నాయి. 2022 జులైలో విరుచుకుపడిన వరదకు దాదాపు 95 నిర్వాసిత ప్రాంతాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. ఇంటిపైకప్పుల నుంచి వరదనీరు పారింది. దీంతో 20వేల కుటుంబాలు వరద బాధితులుగా మారి పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నాయి.

కాఫర్‌డ్యాం ప్రభావంతో వరద నీరు త్వరగా తగ్గకపోవడంతో నెల తరబడి పునరావాస కాలనీల్లోనే మగ్గిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. 25 కిలో బియ్యం, నాలుగు రకాల కూరగాయలు, రూ.రెండు వేల నగదు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దాతలు అందించిన సహాయ సహకారాలతో అంతా నెట్టుకోవాల్సి వచ్చింది. ప్రస్తుత ఏడాది గడిచిన జులై మూడోవారంలో విరుచుకుపడిన వరదలకు రెండు మండలాల్లో 45 నిర్వాసిత ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. 13,764 మంది వరద బాధితులుగా మారారు. రెండు మండలాల్లో 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 4,275 మందిని తరలించారు. మిగిలిన 9,489 మంది కొండలు, గుట్టలపైన కాలం వెళ్లదీసిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికీ కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం, 'ఎ' బ్లాక్, వేలేరుపాడు మండలంలోని రాపాకగొమ్ము, మార్కెట్‌కు చెందిన ప్రజలతోపాటు పలు గ్రామాల ప్రజలు పునరావాస శిబిరాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. మళ్లీ ఆగస్టులో వరద వచ్చే ప్రమాదం ఉండటంతో తిరిగి గ్రామాలకు వెళ్లకుండా అక్కడే ఉండిపోయారు. నిర్వాసితులు ఈ విధంగా ఇబ్బంది పడటానికి కారణం ప్రభుత్వమేనంటూ అక్కడి ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏ ఒక్క హామీ అమలు కాలేదు..!

వైసిపి ప్రభుత్వం వచ్చాక పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన ఏ ఒక్కహామీ అమలు కాలేదు. 2019 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే పునరావాస ప్యాకేజి రూ.6.36 లక్షల నుంచి రూ.పది లక్షలు ఇస్తామని హామీ ఇచ్చింది. నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ హామీ అమలు చేయలేదు. అంతేకాకుండా 2006కు ముందు సేకరించిన భూములకు రూ.కట్టా 15వేలు మాత్రమే ఇవ్వడంతో ఆ భూములకు రూ.ఐదు లక్షలు ఇస్తామని వైసిపి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఇప్పటివరకూ రూపాయి ఇచ్చింది లేదు. 18 ఏళ్ళ నిండిన యువతకు పరిహారం విషయంలోనూ కుప్పిగంతులు వేస్తోంది. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం, జంగారెడ్డిగూడెం వంటి మండలాల్లో పోలవరం నిర్వాసితులకు నిర్మించిన కాలనీల్లో కనీసం తాగునీరుగానీ, డ్రైనేజీ వ్యవస్థగానీ, అక్కడకు చేరిన నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వకపోవడంపై రెండురోజుల క్రితం జరిగిన ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశంలో అక్కడి వైసిపికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులే నిలదీయడం అక్కడి దుర్భర పరిస్థితులకు అద్దంపడుతోంది. గతేడాది వరదలకు రెండు మండలాల్లో వేల సంఖ్యలో ఇళ్లు నేలమట్టమయ్యాయి. దెబ్బతిన్న ఇళ్లకు రూ.పదివేలు పరిహారం ఇస్తామని వేలేరుపాడు మండలం కన్నాయిగుట్టలో వరద బాధితుల పరామర్శకు వచ్చిన సిఎం జగన్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం జాబితాలో చేర్చిన 1280 మందికి ఇప్పటికీ పరిహారం అందలేదు. చేర్చనివారు అనేక మంది ఉన్నారు. 2022 ఆగస్టులో కన్నాయిగుట్ట గ్రామంలో పర్యటించిన సిఎం జగన్ 2022 అక్టోబర్ నాటికి 41.15 కాంటూరు పరిధిలోని ముంపు గ్రామాల ప్రజలకు పునరావాస పరిహారం అందించి ఖాళీ చేయిస్తామని హామీ ఇచ్చారు. 45.72 కాంటూరు పరిధిలోని గ్రామాలకు కేంద్రం నిధులు ఇవ్వాల్సి ఉందని, కేంద్రం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఏడాది గడిచిన ఇప్పటి వరకూ 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాల నిర్వాసితుకు పరిహారం ఇవ్వలేదు. వరదలకు కాంటూరు లెక్కలు తప్పని తేలడంతో లైడార్ సర్వే చేయించి ముంపు లెక్కలు తేలుస్తామని చెప్పారు. లైడార్ సర్వే చేసిన వాస్తవ ముంపు లెక్కలు తేల్చలేకపోయారు. ప్రస్తుత వరదకు సైతం వేలేరుపాడు మండలంలోని సుద్దగుంప, నడింగొమ్ము, పాతపూచర్ల, చాగరపల్లి గ్రామాలు ముంపునకు గురికావడంతో అధికారులే దగ్గరుండి అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ గ్రామాలను ఇప్పటికీ 45.72 కాంటూరులోనే ఉన్నట్లు చెబుతున్నారు. కాంటూరు లెక్కలు సైతం శాస్త్రీయంగా తేల్చలేని దుస్థితి నెలకొంది. మళ్లీ వరద బాధితులను పరామర్శించేందుకు సోమవారం కుక్కునూరు మండలం గొమ్ముగూడేనికి సిఎం వస్తుండటంతో గతంలో ఆయన ఇచ్చిన హామీలపై సర్వత్రా చర్చ కొనసాగుతోంది.

నేడు సిఎం పర్యటన సాగేదిలా..

ఏలూరు ప్రతినిధి : ముఖ్యమంత్రి జగన్ ఈ నెల ఏడోతేదీన ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 1.05 గంటలకు కూనవరం మండలం కోతులగుట్ట నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.40 గంటలకు కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.45 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2.10 గంటలకు హెలీప్యాడ్ నుండి బయలుదేరి మధ్యాహ్నం 2.20 గంటలకు గొమ్ముగూడేనికి చేరుకుని, మధ్యాహ్నం 2.20 గంటల నుంచి 2.50 గంటల వరకూ వరద బాధిత నివాసిత ప్రాంతాల్లో కాలినడకన పర్యటిస్తారు. బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. మధ్యాహ్నం 2.55 గంటల నుండి 3.25 గంటల మధ్య వరద నష్టాలపై జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. అనంతరం గొమ్ముగూడేనికి చెందిన వరద ముంపు బాధితులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3.30 గంటలకు పోలవరం ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి బయలుదేరి 3.35 గంటలకు గొమ్ముగూడెంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుని అక్కడి నుండి హెలీకాప్టర్‌లో రాజమండ్రి బయలుదేరి వెళతారు.

4 సర్పంచి, 47 వార్డులకు ఎన్నికలు

నోటిఫికేషన్ విడుదల - 8 నుంచి నామినేషన్లు, 19న ఎన్నికలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వివిధ పంచాయతీలకు సంబంధించి ఖాళీగా ఉన్న సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏలూరు జిల్లాలో 22 మండలాల పరిధిలోని 46 పంచాయతీలకు సంబంధించి నాలుగు సర్పంచి పదవులకు, 46 వార్డు సభ్యుల పదవులకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో సర్పంచి పదవులకు సంబంధించి జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం పంచాయతీ, ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం పంచాయతీ, పెదపాడు మండలం వీరమ్మకుంట పంచాయతీ, ముదినేపల్లి మండలం వణుదుర్రు పంచాయతీలకు సంబంధించి సర్పంచి ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిన 46 పంచాయతీల పరిధిలోని 47 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఎనిమిదో తేదీ నుంచి పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న విత్‌డ్రా ప్రక్రియ ముగియనుంది. 19వ తేదీన ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఎన్నికల పోలింగ్, రెండు గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది.

పెరిగిన అడ్మిషన్లు

డ్రాపవుట్లు పూర్తిగా నిరోధించాం

టెక్నో స్కూళ్లకు దీటుగా బోధన

హైస్కూల్ ప్లస్‌తో ఉన్నత విద్యాబోధన

ఈ నెలాఖరులోగా నాడు-నేడు పనులు పూర్తి చేసేందుకు చర్యలు

డిఇఒ టి.శ్యామ్‌సుందర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న బహత్తర ప్రణాళికలను జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేసి విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి టి.శ్యామ్‌సుందర్ తెలిపారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల అభివృద్ధి పనులు ఈ నెలాఖరులోగా పూర్తిచేసేందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తి ముఖాముఖీలో పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు.



ప్రశ్న : 'నాడు-నేడు'లో జిల్లాలో పాఠశాలల అభివృద్ధి పనులు ఎంతవరకు వచ్చాయి?

జిల్లాలో మొత్తం 725 పాఠశాలలను నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటిని రెండు విభాగాలుగా చేశారు. వాటిలో అదనపు తరగతి గదులు పాఠశాలలు 288, మిగిలిన పాఠశాలలను ఎన్ఎన్ కాంపోనెంట్స్ విభాగంలోకి మార్చారు. ఈ ఎన్ఎన్ కాంపోనెంట్ విభాగంలో ఉన్న పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు, ఫ్యాన్లు వంటివాటిని పునరుద్ధరించడమే కాకుండా పాఠశాల రూపురేఖలను పూర్తిగా మార్చడమే ముఖ్యఉద్దేశం. ఈ కార్యక్రమంలో పాఠశాలలో ఇంకా పూర్తికాని పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేసేం దుకు ప్రణాళికను రూపొందించాము. ఈ పనులు ప్రతిరోజూ ఏ మేరకు వచ్చాయో తెలుసుకునేందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులతోనూ, మండల విద్యాశాఖ అధికారులతోనూ టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నాం. పనులను వేగవంతం చేసేందుకు ఆదేశాలు జారీ చేస్తున్నాము.



ప్రశ్న : డిజిటల్ క్లాస్ రూముల ఏర్పాటు ఎంతవరకు వచ్చింది?

అదనపు తరగతి గదులు, డిజిటల్ తరగతి గదులను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తాము. డిజిటల్ రూములకు సంబంధించి ఒకటో తరగతి నుండి ఐదో తరగతి విద్యార్థులకు స్మార్ట్ టివితో డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు పూర్తిస్థాయి ప్రణాళిక సిద్ధం చేశాము. అలాగే హైస్కూల్ విద్యార్థులకు ఇంట్రా ఫేస్ ఫ్లాట్ ఛానల్ సహాయంతో తరగతులు బోధించేందుకు అంతా సిద్ధమైంది. ఈ ఇంట్రా ఫేస్ ఛానల్లో విద్యార్థులకు పాటలను బోధించేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులను కూడా ఇప్పటికే పూర్తి చేశాము. ఈ తరహా డిజిటల్ స్క్రీన్‌లపై పాఠాలు బోధించడం వల్ల విద్యార్థుల్లో ప్రతిభ పెరగడమే కాకుండా చదివేటప్పుడు వచ్చే జ్ఞానం కన్నా చూసి చదువుతున్నప్పుడు వచ్చే జ్ఞానం మరింత మెరుగ్గా ఉంటుందని ఈ డిజిటల్ స్క్రీన్‌లపై చదువు చెప్పేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రశ్న : హై స్కూల్ ప్లస్ విధానం జిల్లాలో అమలు ఎంతవరకు వచ్చింది?

టెక్నో పాఠశాలల మాదిరి విద్యార్థులకు విద్యాబోధన చేసేందుకు మరో బృహత్తర ప్రణాళికను ప్రభుత్వం రూపొందించింది. దీని పేరు 'హై స్కూల్ ప్లస్'గా నిర్ణయించింది. ఈ విధానంలో ఎక్కడైతే విద్యార్థులు పదో తరగతి పూర్తి చేస్తారో అదే పాఠశాలలో ఇంటర్ అవకాశాన్ని కల్పించింది. ఇందుకుగాను ఇంటర్ కళాశాలలో అనుసంధానంగా ఉన్న పాఠశాలలో మొదట దీనిని అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే 278 మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఈ పాఠశాలల్లో హై స్కూల్ ప్లస్ తరగతులను చెప్పేందుకు ఎంపిక చేశాము. ఈ విద్యా సంవత్సరంలో ట్రయల్ రన్‌గా దీని ఉంచి వచ్చే విద్యాసంవత్సరంలో పూర్తిస్థాయిలో అమలుపరిచేలా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. హై స్కూల్ ప్లస్ విధానంలో మొత్తం నాలుగు గ్రూపుల్లో విద్యార్థులకు అడ్మిషన్లు లభించనున్నాయి. ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపుల్లో అడ్మిషన్లు విద్యార్థులకు దొరకనున్నాయి. అదనపు తరగతి గదుల విధానంలో ఈ విద్యార్థులకు ల్యాబ్‌లు, ప్రత్యేక డిజిటల్ తరగతులు నిర్వహించనున్నారు..

ప్రశ్న : టెక్నో పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా విద్యాబోధన ఎలా సాగుతుంది?

సాధారణంగా టెక్నో పాఠశాలలు అంటే ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఆ తరగతి నుండే ఐఐటి ఫౌండేషన్ కోర్సులను బోధిస్తారు. ఈ విద్యా సంవత్సరం నుండి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఐఐటి ఫౌండేషన్ తరగతులను ఆ సిలబస్ ప్రకారం బోధన చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాము

ప్రశ్న : ప్రభుత్వ పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్ బోధన ఎంతవరకు వచ్చింది?

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేటు పాఠశాలల తరహాలో సెంట్రల్ సిలబస్‌ను బోధించేందుకు కూడా ప్రత్యేక ప్రణాళికను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ప్రణాళికలో భాగంగానే విద్యార్థులకు ఈ ఏడాది సిబిఎస్ఇ సిలబస్ బోధిస్తున్నాము. వచ్చే విద్యా సంవత్సరం నుండి పూర్తిస్థాయిలో ఈ సిలబస్ అమల్లో ఉంటుంది.

ప్రశ్న : ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు ఎలా ఉన్నాయి? డ్రాపవుట్స్ పెరిగాయా తగ్గాయా?

ఈ ఏడాది 2364 అడ్మిషన్లు పెరిగాయి. దీంతో 30 శాతం అధికంగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ప్రస్తుతం డ్రాప్ అయిన విద్యార్థులు ఎవరైనా ఉన్నట్లయితే వాలంటీర్ల సహాయంతో వారిని వెతికి ఒకవేళ వారు వేరొక జిల్లాకు మారినట్లయితే వారు ఎక్కడ ఉన్నారనే విషయాన్ని తెలుసుకుని అక్కడ పాఠశాలలో వారిని చేర్పిస్తున్నాము. ప్రస్తుతం ప్రతివిద్యార్థికీ ఒక ప్రత్యేక డిజిటల్ ఐడిని ఆధార్ సహాయంతో ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఐడితో ఆ విద్యార్థి రాష్ట్రంలో ఏ జిల్లాలో చదువుతున్నాడన్న అంశంపై పూర్తిస్థాయి అవగాహన వస్తుంది. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో విధానం ప్రకారం ఐదు నుండి 18 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు జిల్లాలో ఎంతమంది ఉన్నారు.. ఎంతమంది పాఠశాలలో చదువుతున్నారు.. ఎంతమంది పనులకు వెళ్తున్నారనే విషయంపై ప్రత్యేకంగా ఒక పట్టికను తయారు చేస్తున్నాం. ఎవరెవరైతే పాఠశాలకు వెళ్లడం లేదు వారిని వెతికి పాఠశాలలకు పంపించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. తల్లిదండ్రులు లేని పిల్లలు, మోసపోయిన బాలికలను వెతికి వారికి ప్రత్యేక వసతి గృహాల్లో విద్యాభ్యాసం అందిస్తున్నాము.

ప్రశ్న : జగనన్న విద్యా కానుక జిల్లాలో పూర్తిగా అందించారా?

జిల్లాలో ఉన్న 1,59,728 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందించాము. ఏ ఒక్క విద్యార్థికైనా జగనన్న విద్యా కానుక కిట్ అందిందా లేదా అన్న అంశంపై కూడా నిత్యం స్థానిక మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలిచ్చి ఒక్కొక్క పాఠశాలను తనిఖీ చేసేందుకు ఆదేశాలు ఇప్పటికే జారీచేశాం.

ప్రశ్న : విద్యార్థుల ఆరోగ్య విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారా?

విద్యార్థుల ఆరోగ్యం పరిరక్షించేందుకు మధ్యాహ్న భోజనం పథకంలో ప్రొటీన్లు, విటమిన్లు ఉన్న ఆహారాన్ని వారికి అందిస్తున్నాం. రక్తహీనత కలిగిన విద్యార్థులను గుర్తించి ప్రతివారం వారికి ఐరన్ ఫోలిక్ మాత్రలు పంపిణీ చేస్తున్నాం.

ప్రశ్న : గతంలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం మొదటి నుండి ఒకటి, రెండు, మూడు స్థానాల్లో ఉండేది. కానీ ఇప్పుడు ఆఖరి నుండి ఒకటీ, రెండు, మూడు స్థానాలకు పడిపోయింది. దీనిపై ప్రత్యేక శ్రద్ధ ఏమైనా తీసుకుంటున్నారా?

బాగా చదివే విద్యార్థులను, చదువులో వెనుకబడిన విద్యార్థులను వేర్వేరుగా ఉంచి చదువులో కొంత వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాము. అంతేకాకుండా వారికి వారాంతపు పరీక్షలు కూడా నిర్వహించి వారిని పూర్తిస్థాయి ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుల సహాయంతో కృషి చేస్తున్నాం. ఈసారి వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

నేడు 'స్పందన' రద్దు

ఏలూరు: సిఎం పర్యటన నేపథ్యంలో ప్రతీసోమవారం జిల్లా, డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో జరిగే స్పందన కార్యక్రమం రద్దుచేసినట్లు అధికారులు తెలిపారు. వరద బాధితుల సహాయక చర్యల పరిశీలనకు కుక్కునూరు మండలం గొమ్ముగూడెంలో సోమవారం సిఎం పర్యటించనున్నారు. దీంతో జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులంతా సంబంధిత విధుల్లో నిమగ్నమవడంతో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు అధికారులు ప్రకటనలో తెలిపారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి

ఏలూరు అర్బన్: ఈనెల తొమ్మిదో తేదీన క్విట్ ఇండియా స్ఫూర్తితో 'క్విట్ మోడీ' నినాదంతో కార్మిక సంఘాలు తలపెట్టిన చలో విజయవాడ మహా ధర్నాలో కార్మిక వర్గం, ఉద్యోగులు పాల్గొనాలని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు సంఘాలు పిలుపునిచ్చాయి. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్మికుల న్యాయమైన కోర్కెలు ఏ ఒక్కటీ తొమ్మిదేళ్ల మోడీ పరిపాలనలో పరిష్కారం కాలేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోర్టులు సూచించినా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీమ్ వర్కర్లను, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయకుండా శ్రమ దోపిడీకి ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. ప్రభుత్వంలోని కీలక రంగాలతో సహా, ప్రభుత్వ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరిస్తామని మోడీ ప్రభుత్వం ప్రకటించిందని, 900 రోజులుగా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఆందోళన చేస్తున్నా, ప్రయివేటీకరణకే మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించడం అత్యంత దారుణన్నారు. ప్రభుత్వ నిధులతో అసంఘటితరంగ కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ ఆరోగ్య సౌకర్యాలతో కూడిన సామాజిక సంక్షేమ పథకాన్ని ఇంతవరకూ ప్రకటించలేదని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న చట్టాన్ని అమలు చేయడం లేదని పేర్కొన్నారు. కొత్త పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. ఇపిఎఫ్ పెన్షన్‌ను కనీసం రూ.తొమ్మిది వేలకు పెంచాలన్న డిమాండ్‌ను ఆమోదించడం లేదని, ప్రతీ సంవత్సరం జరపాల్సిన త్రైపాక్షిక భారత కార్మిక మహాసభ జరపడం లేదని, ఈ మహాసభను జరిపితే కార్మిక సమస్యలు చర్చకు రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. అఖిలభారత సమ్మెలతో కార్మిక ఉద్యోగ వర్గాలు నిరసనలు తెలియజేస్తున్నా మోడీ ప్రభుత్వానికి చలనం లేదన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల ధరలు పెరిగి, గొర్రె తోక వేతనాలతో కార్మిక, ఉద్యోగ వర్గాలు సతమతమవుతున్నాయన్నారు. ఒకపక్క ఆకలి, పేదరికం, నిరుద్యోగం పెరుగుతుంటే మరో ప్రక్క సంపద మొత్తం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్‌ల చేతుల్లో పోగుపడుతోందని విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతి వృత్తిదారులు తదితర శ్రామికవర్గాల అసంతృప్తిని నిట్టనిలువునా చీలుస్తూ కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతూ దళితులు, గిరిజనులు, మహిళలపై నిత్యం దాడులకు తెగబడుతూ, విద్వేష రాజకీయాలను మోడీ ప్రభుత్వం పురిగొల్పుతోందని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు కె.విజయలక్ష్మి, వి.సాయిబాబు, జె.గోపి, జాన్ బాబు, రమణ పాల్గొన్నారు.

మూడో రోజుకు 'భూమికోసం సమర శంఖారావం' పాదయాత్ర

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు, పేదలు

మండలంలోని పంగిడిగూడెం, నాగులగూడెం పేదలకు ల్యాండ్ సీలింగ్ ప్రభుత్వ భూములలో ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని ఎపి వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో పేదలకు పట్టాలివ్వాలని చేపట్టిన భూమికోసం సమరశంఖారావం పాదయాత్ర మూడోరోజు ఆదివారం చక్రదేవరపల్లి, గురవాయిగూడెం, నాగులగూడెం, పంగిడిగూడెం, కేతవరం గ్రామాల్లో పాదయాత్ర జరిగింది. ఈ యాత్రనుద్దేశించి సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ ఈ గ్రామాల్లో ల్యాండ్ సీలింగ్ భూములు రెండు వేల ఎకరాలున్నాయన్నారు. ఆ భూములను అధికార పార్టీ భూస్వాములు ఆక్రమించి సాగు చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ఆ భూముల్లో పేదలకు పట్టాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే నాగులగూడెంలో 20 సంవత్సరాల క్రితం సర్వేనెంబర్ 439, 440లో 1.79 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిలో 30 నిరుపేద కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే నాలుగుసార్లు ప్రభుత్వాలు మారినా పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలివ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికలకు ముందు చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా తాను గెలిచిన వెంటనే గుడిసెలకు పట్టాలిస్తానని హామీ ఇచ్చారని, కానీ నేటికి నాలుగేళ్లు గడుస్తున్నా పేదలకు పట్టాలివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు భూస్వాముతో కుమ్మక్కై పేదలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పంగిడిగూడెంలో పేదలకు ల్యాండ్ సీలింగ్ భూములు పంచాలని గత 20 సంవత్సరాలుగా పోరాటాలు నిర్వహిస్తుంటే భూస్వాములకు ప్రభుత్వం కొమ్ముకాస్తూ పేదలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. పేదలందరినీ ఐక్యం చేసి ఈనెల ఎనిమిదో తేదీన జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పాదయాత్రలో సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత, తామ ముత్యాలమ్మ, మాదాసు ఆనందరావు, నిట్ట నాగరాజు, కె.సుబ్బారావు, సిహెచ్. లక్ష్మీనారాయణ, పి.దుర్గారావు, జి.సూర్యకిరణ్ పాల్గొన్నారు.

అల్లూరి శతవర్ధంతి సందర్భంగా పోటీలు

9 నుంచి15 వరకూ ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నిర్వహణ

ప్రజాశక్తి - ఏలూరు

అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సంవత్సరం సందర్భంగా ఎవిఆర్ విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాసరచన, ఉపన్యాసం, నృత్య నీరాజనం కార్యక్రమాలను జయప్రదం చేయాలని విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు విజ్ఞప్తి చేశారు. పవర్ పేటలోని అన్నే భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమాల బ్రోచర్‌ను వై.ఆనంద నాయుడు ఆవిష్కరించారు. విద్యార్థులు, కళాకారులు, గాయకులు, వివిధ సంస్థల పెద్దలు పాల్గొనేలా ఈనెల తొమ్మిదో తేదీ నుండి 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం చేపడుతుందన్నారు. 9, 10 11 తేదీల్లో హై స్కూల్స్, కాలేజీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కాలేజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు, హైస్కూల్ విద్యార్థులకు స్వతంత్ర్య పోరాటంలో అల్లూరి పాత్ర అంశంపై ఉపన్యాస పోటీలు జరుగుతాయన్నారు. విజ్ఞాన కేంద్రం సభ్యులు వై.ఆనంద నాయుడు మాట్లాడుతూ 15వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుండి కోట దిబ్బలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాటలు పాడించడం, వివిధ స్కూల్స్, కాలేజీలు నృత్య బృందాల విద్యార్థులతో కళా ప్రదర్శనలు, నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆసక్తి గలవారు 94900985594, 74166 71480 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. విజేతలకు 15వ తేదీన జరిగే సభలో ప్రశంసాపత్రాలు, అల్లూరి జీవిత చరిత్ర పుస్తకాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.గంగాధర్‌రావు, కె.శ్రావణి కుమారి, పి.దుర్గాప్రసాద్, వి.ఠాగూర్ పాల్గొన్నారు.

సాగునీరందించాలని రైతుల నిరసన

ఏలూరు అర్బన్: కృష్ణా డెల్టా శివారు ప్రాంతం పాతజాలిపూడి కాలువ పరిధిలో పొలాలకు సరిపడు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో జాలిపూడిలో నెర్రలు తీసిన వరి పొలాల్లో రైతులు కౌలు రైతులు నిరసన వ్యక్తం చేశారు. శివారు ప్రాంత భూములకు సాగునీరందించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా డెల్టా శివారు ప్రాంత పాతజాలిపూడి కాలువ పరిధిలో సుమారు 1200 ఎకరాలకు సరిపడు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాగునీరు లేక నాట్లు వేయడానికి కుదరక మరోవైపు నారు ఎదిగిపోయి ఉండటంతో ఏం చేయాలో అర్థంకాక రైతులు, కౌలు రైతులు సతమతమవుతున్నారని చెప్పారు. ఇప్పటికే వరి నాట్లు ఆలస్యమయ్యాయని మరింత ఆలస్యమైతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. పాతజాలిపూడి కాలువ అనేక చోట్ల ఆక్రమణలకు గురి కావడంతో శివారు ప్రాంత భూములకు సాగునీరు తక్కువగా అందుతుందని చెప్పారు. జాలిపూడి కాలవకు సరిపడా సాగునీరు వదిలి శివారు ప్రాంత భూములకు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేపక్షంలో రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు, రంగారావు, రాంబాబు, రాంబాబు, శ్రీనివాసరావు, ఇంటి పెద్దిరాజు, కూడవల్లి భవాని పాల్గొన్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి

ఏలూరు అర్బన్: జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు వాగ్దానం చేసిన విధంగా సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జివి రమణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సయ్యద్ జఫరుల్లా అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. వైద్య ఆరోగ్యశాఖలో యాప్‌ల పేరుతో పని భారం పెంచారని, ఫలితంగా సచివాలయం హెల్త్ సెక్రటరీలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించే ప్రధాన లక్ష్యాన్ని పక్కనపెట్టి యాప్‌ల పేరుతో సిబ్బందిపై పనిభారం పెంచడం సరైనది కాదన్నారు. గత పిఆర్‌సిలో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దానిని సరి చేయకుండా కొత్త పిఆర్‌సిను ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో క్రింది స్థాయి సిబ్బందిపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న కాంట్రాక్ట్ సిబ్బందికి ప్రతినెలా 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సచివాలయం హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిశీలించాలని కోరుతూ ఈనెల 18వ తేదీన ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీన యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డి.వేణుగోపాల్, టి.శ్రీ లక్ష్మి, భాగ్యలక్ష్మి, వాసు, త్రివేణి, నీలాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్

వ్యవసాయ రంగం అభివృద్ధికి తోడ్పాటు

ప్రజాశక్తి - ముసునూరు

గాద్రేజ్ కంపెనీ వారు ఫామ్‌ఆయిల్ మొక్కల కంపెనీ పెట్టడంతో ముసునూరు మండలం వ్యవసాయరంగంలో అభివృద్ధి సాధిస్తుందని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన ముసునూరులో గాద్రేజ్ ఫామ్‌ఆయిల్ కంపెనీ రైతులకు ఫామ్‌ఆయిల్ మొక్కలు అందించారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు మాట్లాడుతూ ఫామ్‌ఆయిల్ మొక్కలు కొరత లేకుండా చూడాలన్నారు. దిగుబడి పెంచుకునేందుకుగాను ఫామ్‌ఆయిల్ తోటల్లో శాస్త్రవేతలతో సమావేశాలు నిర్వహించాలని కోరారు. వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫామ్‌ఆయిల్ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, యాంత్రీకరణ పనిముట్లు, డ్రిప్స్‌సబ్సిడీపై అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, పాముల గంగధరరావు, సర్పంచి కె.విజయలక్ష్మి, గాద్రేజ్ కంపెనీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చావ్లా వెంకటేశ్వరావు, జనరల్ మెనేజర్ స్వీటి, హార్టికల్చరల్ మండల అధికారి ప్రియాంక, సూపర్ వైజర్ దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.


టీచర్స్ ఎన్రిచ్మెంట్ ప్రోగ్రామ్‌లో ఉపాధ్యాయులు

పని ఒత్తిడితో అనారోగ్యం

ప్రజాశక్తి - ఏలూరు

ఈరోజుల్లో ఉపాధ్యాయులు పనులు ఒత్తిడి, మొబైల్ ఎడిక్షన్ వలన మనసిక రుగ్మతలతో బాధపడుతూ మంచి ఆరోగ్యానికి దూరం అవుతున్నారని, ఉపాధ్యాయులు నిరంతర అభ్యాసికులేనని డా.ఎం.ప్రేమ్ మసంద్(మౌంట్ అబు రాజస్థాన్) తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ అండ్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ ఏలూరు జోన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం టీచర్స్ ఎన్రిచ్మెంట్ ప్రోగ్రామ్ సిఆర్‌ఆర్ కాలేజ్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా.ఎం.ప్రేమ్ మసంద్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమరీస్ ఏలూరు శాఖా నిర్వహకురాలు, లావణ్య జోన్ అధ్యక్షులు, కె.చంద్రశేఖర్, కార్యదర్శి ఎన్ఆర్‌కెఎ ప్రసాద్, కోశాధికారి కె.వినోద్, సిఆర్‌ఆర్ కాలేజ్ ప్రిన్సిపల్ రామరాజు, జిల్లా అధ్యక్షులు జి.బుల్లబ్బాయ్, కోశాధికారి జి.రవిశంకర్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎంబిఎస్ శర్మ, రాష్ట్ర ఆపుస్మా సలహాదారుడు కోనేరు సురేష్ బాబు పాల్గొన్నారు.

జిల్లా జైలులో దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు

జైల్ సూపరింటెండెంట్ సిహెచ్ ఆర్‌వి.స్వామి ఆధ్వర్యంలో ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్, స్టార్ డెంటల్ హాస్పిటల్, ఏలూరు వారి సహకారంతో జిల్లా కారాగారంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. జైలర్స్ కె.వెంకటరెడ్డి, కె.శ్రీనివాసరావులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.శ్రీహర్ష ఖైదీలను, సిబ్బందిని పరీక్షించి దంత సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి మందులు, పేస్టులు ఉచితంగా అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కెబిరావు, లయన్స్ జిల్లా నాయకులు ఎల్.వెంకటేశ్వరావు, సీనియర్ న్యాయవాది కూన కష్ణారావులు మాట్లాడుతూ భవిష్యత్‌లో అవసరమైన వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జైలర్ కె.సత్యనారాయణ, జైల్ సిబ్బంది, స్టార్ డెంటల్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


కృత్రిమ కాళ్ళను పొందిన వారితో మస్తానయ్య, అజయ్‌కుమార్

ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి

ఆగిరిపల్లి: వికలాంగులు కృత్రిమ అవయవాల అమరిక వలన ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని విద్య, జీవిత నైపుణ్యాలను నేర్చుకొని స్వశక్తి వంతులుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష డైరెక్టర్ మస్తానయ్య అన్నారు. మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో ఎలిజబెత్ పాంటన్ లెగసీ ఆఫ్ హెూప్, కృత్రిమ అవయవకేంద్రం నందు ఆదివారం బుర్రా యస్వంత్, జి.గుణసాయి, ఆర్.సునీత, డి.సామ్రాజ్యంలకు కృత్రిమ కాళ్లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో హీల్ సిఇఒ కె.అజయ్‌కుమార్, సమగ్ర శిక్ష అధికారులు భాస్కర్‌కుమార్, శ్యామ్, సీనియర్ టెక్నిషియన్ కె.చిన్నా, వరకుమార్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇద్దరు మహిళల వేధింపులు తాళలేక భార్యాభర్తలు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దెందులూరు మండలం కొమరేపల్లి గ్రామానికి చెందిన కొరపాటి నాగయ్య (35)కు భార్య జాన్సీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన అతని భార్యను ఎస్తేరు రాణీలు వేధిస్తున్నారు. వారి వేధింపులు భరించలేక నాగయ్య, జాన్సీలు ఆదివారం మధ్యాహ్నం ఇంటి వద్ద పురుగుమందు తాగారు. వీరిద్దరు తీవ్ర అస్వస్థతకు గురికాగా బంధువులు ఆసుపత్రిలో చేర్పించారు. వీరిద్దరు చికిత్స పొందుతున్నారు.

అధికారుల అలసత్వం.. పాలకుల నిర్లక్ష్యం..

నీటి కోసం మహిళల పాట్లు వెలగని వీధిలైట్లు
బురద రోడ్లతో అవస్థలు
పాములతో భయం..భయం
ఇందిరమ్మ కాలనీలో దుస్థితి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కనీస సౌకర్యాలు లేక ఇందిరమ్మ కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తమకు సౌకర్యాలు కల్పించాలంటూ పలుసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకున్న వారే లేరు.. అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం ఇందిరమ్మ కాలనీ వాసులకు శాపంగా మారింది.

మండలంలోని గురజ ఇందిరమ్మ కాలనీ ఏర్పడి 15 ఏళ్లైంది. కానీ ఇక్కడ కాలనీ వాసులకు కనీస సౌకర్యాలు లేక అనేక సమస్యలతో సతమతమౌతున్నారు. సూమారు ఏడు వందల లోపు జనాభా ఉన్న కాలనీలో ప్రజలు పలు సమస్యలతో నానా అవస్థలు పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కారించాలంటూ గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకున్న నాథుడే లేడంటూ కాలనీ వాసులు పాలకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుంతల నుంచే నీరు తోడుకుంటూ..

కాలనీ వాసుల నీటి అవసరాల కోసం పంచాయతీ ఆధ్వర్యంలో కాలనీలో ఏడు చోట్ల నీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఈ కుళాయిల ద్వారా నీరు అరకొరగా వస్తుంది. దీంతో చేసేది లేక కాలనీ వాసులు కుళాయి ఉన్న చోట మూడు నుంచి ఐదు అడుగుల మేర లోతులో గుంతలు తవ్వి, కుళాయి పైపుకు రబ్బరు ట్యూబు తొడిగి నీటిని బిందెల్లోకి పట్టుకుంటున్నారు. ఈ పరిస్థితి ఐదేళ్లగా ఉంది. దీంతో గుంతల్లో నుంచి నీరు పట్టుకునేందుకు వృద్దులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

రోడ్లన్నీ బురదమయం..

ఈ కాలనీలో మొత్తం పది రోడ్లు ఉన్నాయి. తొమ్మిది అంతర్గత రోడ్లు కాగా, ఒకటి కాలనీ ప్రధాన రోడ్డు. ఈ రోడ్డు మాత్రమే సీసీ రోడ్డు, మిగతా తొమ్మిది రోడ్లు మట్టి రోడ్లు కావడంతో వర్షాకాలంలో బురద మయంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలంలో బురద రోడ్లతో వీరి బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఇంటి నుంచి కాలు బయటకు పెట్టే పరిస్థితి లేదు. అంతా బురదమయం


గుంతలో నుంచి నీరు తోడుకుంటున్న మహిళ


కాలనీలో బురద రోడ్లు ఇలా..

వెలగని వీధి దీపాలు..

కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. రెండు నెలలుగా కాలనీ చివరి వీధిలో వీధి దీపాలు వెలగడంలేదన్నారు. దీంతో రాత్రి వేళలో చీకటిలో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. పలుసార్లు పంచాయతీ అధికారులకు చెప్పినా రేపుమాపు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాములతో భయం..

చీకటి పడితే కాలనీలో విషనాగులు స్వైరవిహారం చేస్తున్నాయి. కాలనీ చేలకు సమీపంలో, పంటకాల్వకు ఆనుకుని ఉన్న కారణంగా పాముల సంచారం అధికంగా ఉంది. దీంతో చీకటిలో ఇంటి నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు వీధి దీపాలు పాడై వినియోగంలో లేవు. చీకటిలో ఏపాము కాటుకు గురౌతామోననే భయంతో కాలనీ వాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నిత్యం భయంభయంగా జీవించాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైన జిల్లాస్థాయి అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని కోరుతున్నారు.

పాములతో భయమేస్తోంది

వెంకటలక్ష్మి, కాలనీ వాసి



చీకటి పడితే కాలనీలో పాములతో భయమేస్తోంది, వీధి దీపాలు మరమ్మత్తులకు గురైనందున వీధి దీపాలు వెలగడం లేదు. కాలనీలో పాముల సంచారం అధికంగా ఉంది. పిల్ల పాపలతో జీవిస్తున్నాం ఎప్పుడు ఏపాము కాటుకు గురౌతామోననే భయంతో జీవించాల్సి వస్తోంది.

అధికారులు పట్టించుకోవడం లేదు

షేక్ రహీం ఉన్నీసా, కాలనీ వాసి



కాలనీలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కాలనీ రోడ్లను అభివృద్ధి చేయాలంటూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కాలనీలో నల్లమట్టి రోడ్లు కావడంతో వర్షానికి నడిస్తే పడిపోతున్నాం. అధికారులు స్పందించి రోడ్లును అభివృద్ధి చేయాలి.

బురద రోడ్లతో చస్తున్నాం

కాగిత ధనలక్ష్మి, కాలనీ వాసి



కాలనీలో బురద రోడ్లతో నడవలేక చస్తున్నాం. వర్షానికి రోడ్లన్నీ బురదమయం కావడంతో రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నాం. నల్లమట్టి రోడ్లు వల్ల పలుసార్లు కాలు జారి ప్రమాదాలకు గురౌతున్నాం.

కుళాయిల్లో నీరు రావడం లేదు

రూతమ్మ, కాలనీ వాసి



కాలనీలో ఉన్న ఏ ఒక్క కుళాయిలోనూ నీరు రావడం లేదు. దీంతో కుళాయి ఉన్న చోట నాలుగు అడుగుల మేర లోతులో గుంతలు తవ్వీ గుంతల్లో నుంచి నీరు తోడుకుంటున్నాం. కుళాయిల ద్వారా నీరు రాక నీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలి.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి : యుటిఎఫ్


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ శ్రమిస్తుందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం పాటుపడుతుందని, రాష్ట్ర సంఘం ఇచ్చిన అన్ని కర్తవ్యాలను మండల నాయకత్వం అమలు చేయాలని జిల్లా అధ్యక్షులు ముస్తఫా ఆలీ కోరారు. యుటిఎఫ్ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ అధ్యక్షతన ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ఏలూరు జిల్లాలోని 28 మండల శాఖలకు సంబంధించిన మండల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శులు హాజరైనారు. ఈ సందర్భంగా ముస్తఫా ఆలీ మాట్లాడారు. ఉపాధ్యాయుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రవికుమార్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నమోదు బాగా తగ్గిపోయిందని, దానికి కారణం 117 జీవో అమలు చేయడం వల్ల ఎలిమెంటరీ పాఠశాల నుంచి మూడు, నాలుగు తరగతులను హైస్కూల్లో విలీనం చేయడం వల్ల అనేక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులలో 20 మంది పిల్లలు, ఇంకా కొన్ని పాఠశాలలో 10లోపు పిల్లలు ఉండటం జరుగుతుందన్నారు. అమ్మఒడి డబ్బులు జూన్ నెలలో వేయటం వలన కొంతమంది పేరెంట్స్ ఆ డబ్బులతో పిల్లలను ప్రయివేట్ కాన్వెంట్ లలో చేర్చుకున్నారన్నారు. నాడు నేడు అమలు చేసి పాఠశాలల బిల్డింగ్‌లను ఎంతో చక్కగా మార్చినప్పటికీ పిల్లలు లేకపోవడం వల్ల అవి ఉపయోగంలేనివిగా తయారైనవన్నారు. అలాగే బదిలీల పర్వం జూన్ 12వ తేదీకి ముగించిన ప్రభుత్వం, బదిలీ పొందిన ఉపాధ్యాయులకు మూడో నెల జరుగుతున్నప్పటికీ జీతాలు చెల్లించకపోవడం చాలా అన్యాయమని, వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి సుభాషిని మాట్లాడుతూ 9 గంటల లోపు ముఖ ఆధారిత హాజరు వేయని ఉపాధ్యాయులను ఆబ్సెంట్‌గా పరిగణిస్తామని వచ్చిన సమాచారం వలన ఎంతోమంది ఉపాధ్యాయులు 9 గంటల కంటే ముందే వెళ్లి వేసినప్పటికీ సర్వర్ పని చేయకపోవడం వలన గంటల సమయం వరకూ హాజరు నమోదు కావడం లేదన్నారు. లాగిన్ అయిన వెంటనే అదే సమయం నోట్ చేసేలాగా సాఫ్ట్వేర్ సెట్ చేయాలని కోరారు. అలాగే ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆగస్టు 12వ తేదీన ఉపాధ్యాయుల పరిష్కారం నిమిత్తం జరిగే 12 గంటల ధర్నాలో జిల్లా ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యవర్గం సమావేశంలో 1. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు యుటిఎఫ్ కార్యకర్తలు కృషి చేయాలని, 2. ముఖ ఆధారిత హాజరు అమలులో ఉన్న లోపాలను సరిచేసి పాఠశాలకు వెళ్లి లాగిన్ అయి హాజరు నమోదు చేసిన వెంటనే అదే సమయం చూపించే లాగిన్ సర్వర్ స్పీడ్ పెంచాలని, నెట్వర్క్ ప్రాబ్లమ్స్ కూడా పరిగణలో తీసుకోవాలని, 3. మూడు నెలలు కావస్తున్నా జీతాలు రాని, బదిలీ కాబడిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించేలా ఏర్పాటు చేయాలని, 4. ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉపాధ్యాయులను తప్పుపట్టే ధోరణి విడనాడి వారిని ప్రోత్సహించాలని ఆ మేరకు రాష్ట్ర కమిటీ ప్రాతినిధ్యం చేయాలని, 5.ఉపాధ్యాయ సమస్యలపై ఆగస్టు 12వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే 12 గంటల ధర్నాను విజయవంతం చేయాలని తీరానించారు. ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్ రావు, కోశాధికారి జీవి రంగమోహన్, కార్యదర్శిలు శివ శంకర్రావు పాల్గొన్నారు.

కలిదిండి సొసైటీ అధ్యక్షునిగా రామారావు

ప్రజాశక్తి - కలిదిండి

సొసైటీ నూతన అధ్యక్షునిగా వడుపు రామారావు ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపిపి కూసంపూడి కనకదుర్గా రాణి, సర్పంచిల ఫోరం అధ్యక్షులు గద్దె ఆనంద్ కుమార్, ఎఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్, సర్పంచి మసిముక్కు మారుతీ ప్రసన్న వెంకటేశ్వరరావు రామారావుకు పుష్పగుచ్చాలు అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కళ్యాణి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ పిఎసిఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. తన ఎన్నికకు సహకరించిన ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావుకు, మాజీ ఎఎంసి ఛైర్మన్ చిట్టూరి మురళీ కృష్ణకు వడుపు రామారావు కృతజ్ఞతలు తెలిపారు.


స్నేహితుల దినోత్సవంలో పూర్వ విద్యార్థులు

స్నేహితుల దినోత్సవంలో అలనాటి స్నేహితులు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పలు గ్రామాలలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం వివిధ రూపాల్లో నిర్వహించారు. దీనిలో భాగంగా భీమడోలు హైస్కూల్ వేదికగా పాఠశాలలో పదవ తరగతి చదివిన వివిధ విద్యా సంవత్సరాలకు చెందిన అప్పటి విద్యార్థులు సమావేశాల నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్న అప్పటి విద్యార్థులు ఇక్కడికి చేరుకున్నారు. ఒకరి యోగ క్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. వివిధ రూపాల్లో ఇబ్బందుల్లో ఉన్న అప్పటి స్నేహితులను ఆదుకునేందుకు ముందుకు వస్తామని హామీలు ఇచ్చారు. ఇదే క్రమంలో పాఠశాలకు చెందిన 2000-01 విద్యా సంవత్సరపు పదవ తరగతి విద్యార్థులు కేకును కట్ చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు.

కలిదిండి: స్థానిక పంచాయతీ కార్యాలయంలోని పారిశుధ్య కార్మికులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1992-93 బ్యాచ్ విద్యార్థుల ఆర్థిక సాయంతో ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను సర్పంచి మసిముక్కు మారుతీ ప్రసన్న వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

మణిపూర్‌లో మారణ హోమాన్ని ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి - భీమడోలు

మణిపూర్ మారణ హోమాన్ని ఖండిస్తూ క్రైస్తవ సంఘాలు గుండుగొలనులో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సెయింట్ ఆండ్రూస్ సిఎస్ఐ చర్చి ఫాదర్ రెవరెండ్ కె.ఇశ్రాయిల్ మాట్లాడుతూ మణిపూర్ మారణ హోమం దేశ ప్రజలకు ప్రమాదకరమైన సంకేతాలను ఇస్తుందన్నారు. సమస్యను మానవతా దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గుండుగొలను గ్రామానికి చెందిన సిఎస్ఐ, ఆర్‌సిఎం తదితర చర్చిల ప్రతినిధులు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.


మండవల్లిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు..

మండవల్లి: క్రైస్తవ స్త్రీలను వివస్త్రులను చేసి రోడ్లపై ఊరేగించిన మణిపూర్ సంఘటనలు ప్రపంచ దేశాలు తలదించుకునేలా ఉన్నాయని పలువురు పాస్టర్లు తెలిపారు. మణిపూర్‌లో చోటు చేసుకున్న హింసాత్మక చర్యలపై కేంద్రం జోక్యం చేసుకొని శాంతి నెలకొల్పాలని కోరుతూ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక స్టేషన్ రోడ్ సెంటర్ నుంచి ప్రధాన సెంటర్ వరకూ పెద్ద ర్యాలీ నిర్వహించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో స్త్రీకి అత్యున్నత స్థానం ఉన్నదన్నారు. అలాంటి క్రైస్తవ స్త్రీలను వివస్త్రలను చేసి వీధి వీధినా తిప్పుతూ, అవహేళన చేస్తూ మానభంగం చేసి, చంపేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. చిన్నారులు వద్దులు అనే తేడా లేకుండా హింసించి చంపేయడం అనేది సహించరాని నేరం అన్నారు. ఈ హింసాత్మక చర్యలను ప్రపంచ దేశాలు ఖండించాలని అన్నారు. స్వార్థ రాజకీయాల కోసం మతోన్మాద శక్తులు చెలరేగి హింసాత్మక చర్యలకు పాల్పడుతుంటే కేంద్రం చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు చేబ్రోలు సతీష్ బాబు, కడియం యోసేపు, మేజర్ పి.మణిబాబు, సిహెచ్ జాన్ శాస్త్రి, పాస్టర్ సైమన్, పాస్టర్ తిమోతి, ఫాస్టర్లు పాల్గొన్నారు.

'చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం సరికాదు'


టి.నరసాపురం సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి - ముసునూరు

వైసిపి ప్రభుత్వం 40 ఏళ్ల చరిత్ర కలిగిన నారా చంద్రబాబు నాయుడు పర్యటన అడ్డుకోవడం పిరికిపందల చర్య అని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ముసునూరు మండలం, అక్కిరెడ్డిగూడెం గ్రామంలో రెండవ రోజు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా శ్రేణులపై వైకాపా శ్రేణుల దాడి ఒక పథకం ప్రకారం పోలీసుల అండదండలతోనే జరిగిందన్నారు. పుంగనూరులో పోలీసులు పెద్దిరెడ్డి కనుసన్నల్లో పనిచేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చన్నారు. జడ్ ప్లస్ కేటగిరీ కలిగిన చంద్రబాబు పర్యటన మార్గంలో పోలీసులు లారీని అడ్డంపెట్టి రాకుండా ఆపడం ఒక అనాగరిక చర్య అన్నారు. గతంలో చంద్రబాబు నూజివీడు పర్యటన సమయంలో కూడా ఇదే విధంగా పోలీసులు అడ్డంకులు సృష్టించారన్నారు. వైకాపా శ్రేణులకు పోలీసులు సహకరించడం, తిరిగి తెదేపా కార్యకర్తలపై లాఠీఛార్జి చేయడం దారుణమన్నారు. ఈ దాడులకు భయపడేది లేదని, ఇంతకి రెండింతలు ఉత్సాహంగా తెదేపా కార్యకర్తలు పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చయ్య, నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి, నియోజవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు అరికోటి సంగీతరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహణ కార్యదర్శి గద్దె రఘుబాబు, గ్రామ పార్టీ బర్మా శ్రీనివాసరావు, సర్పంచి పులి బళ్ల సత్యనారాయణ, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు మానురాజు సురేష్, ఉల్లాస బాబి, నామ సత్యనారాయణ, మెదరమెట్ల సురేంద్ర, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన జయప్రదం చేయాలి : టిడిపి

టి.నరసాపురం: జిల్లాలో జరిగే చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు రామమూర్తి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టిడిపి మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్ అధ్యక్షతన ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పట్టిసీమలో యామిని ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తలతో ముఖాముఖీ నిర్వహిస్తారని ఆయన తెలిపారు. అనంతరం పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారన్నారు. మండలంలోని 15 పంచాయతీల నుంచి కార్యకర్తలు తరలివచ్చి బాబు పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆచంట బాబీ, నాళం కాశీ, పెద్దిన చంద్రశేఖర్, వీరేశలింగం, పెద్దిన సురేష్, యువరాజ్ పాల్గొన్నారు.

ప్రజా కళాకారుడు గద్దర్‌కు నివాళి


ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా కళాకారుడు, రచయిత, ప్రజా యుద్ధ నౌక గద్దర్ మృతికి సాహితీ స్రవంతి జిల్లా కమిటీ తీవ్ర సంతాపం తెలియజేసింది. ఈ సందర్భంగా కడలి రామాంజనేయులు మాట్లాడుతూ తన ఆటతో, పాటతో, ప్రజల హృదయాలను కొల్లగొట్టి, పాలక వర్గాలపై పోరాటం చేసిన సామాజిక విప్లవ కారుడు అని కొనియాడారు. అనంతరం తన జీవిత కాలం వామ పక్ష ఉద్యమాలకు ఊపిరులు ఊది, దగా పడిన ప్రజల గుండె చప్పుడు అయిన సాంస్కృతిక యోధుడు గద్దర్‌కు ఘన నివాళులు అర్పించారు.

జనసేనలోకి పలువురు

ప్రజాశక్తి - ఉంగుటూరు

పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి యువత పెద్ద ఎత్తున జనసేన పార్టీలోకి చేరుతున్నారని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ఇంఛార్జి పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. ఆదివారం జనసేన ఉంగుటూరు కార్యాలయం వద్ద వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ జనసేనకి యువతే పెద్ద బలం అని, యువత తలుచుకుంటే సాధించలేనిది ఏమి లేదని, రాబోయే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేసేంతవరకు కృషి చేయాలని కోరారు. పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అయితే సామాన్య ప్రజల కోరికలు నెరవేరుతాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పవన్ కళ్యాణ్‌తో మాత్రమే సాధ్యం అన్నారు. నారాయణపురం గ్రామం నుంచి వివిధ వర్గాలు, పార్టీలకు చెందిన 55 మంది యువత తీర్లంగి శ్రీనివాస్, తమ్మినేని సాయి, నేతింటి నాగరాజు, కాకటి ప్రవీణ్, విజయ్ తదితర నాయకులు తాడిశెట్టి శివ ప్రసాద్ ఆధ్వర్యంలో జనసేనలోకి చేరారు. ఈ కార్యక్రమంలో వంగా రఘు, చింతలపాటి బాసి రాజు, సూరత్తుల అయ్యప్ప పాల్గొన్నారు.


అంబెద్కర్ విగ్రహా ఆవిష్కరణ..

గుర్వాయిపాలెంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని గుర్వాయిపాలెంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ జరిగింది. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని ఎస్‌సి సెల్ నియోజకవర్గ నాయకులు బోడిగడ్డ కిషోర్ అన్నారు. విగ్రహదాత వైసిపి నియోజకవర్గ నాయకులు పోసిన చెంచు రామారావు మాట్లాడుతూ గ్రామానికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పటిలాగే కొనసాగుతాయన్నారు. ఆ కార్యక్రమంలో నాయకులు కమతం సుబ్బయ్య దాసు, భేతాళ మణి, సిఎస్ఐ చర్చి ఫాదర్ సురేష్, సంఘ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు జనసేన సాయం

పోలవరం: మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని జనసేన పోలవరం నియోజకవర్గ ఇంఛార్జి చిర్రి బాలరాజు తెలిపారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డి పేటలో, రెండు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలిసి జనసేన నియోజకవర్గ ఇంఛార్జి చిర్రి బాలరాజు, మండల అధ్యక్షులు గునపర్తి వీరవెంకట సత్యనారాయణ(చిన్ని) తో కలిసి బాధిత కుటుంబానికి రూ.5 వేలు, నిత్యావసర వస్తువులను అందజేశారు.